గోవిందరావుపేటతండాలోని కేంద్రంలో ధాన్యాన్ని సంచుల్లో నింపుతున్న మహిళా రైతులు

రైతులే.. హమాలీలుగా

- పురుషులతో సమానంగా వడ్లు కాంటా వేస్తున్న మహిళా రైతులు

వారంతా మహిళా రైతులు. ఈ వేసవిలో వారికి ఉపాధి కరువు కావడం.. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం వేసేవారు లేకపోవడంతో హమాలీలుగా మారారు. వారు పండించిన ధాన్యాన్ని వారే తూకం వేస్తున్నారు. ధాన్యం తూకం వేయడంలో పురుషులతోపాటు మహిళలు సమానంగా పనిచేస్తున్నారు. ధాన్యం బస్తాలను నింపడంతో పాటు లారీల్లో లోడ్ చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కోనరావుపేట మండలం గోవిందరావుపేట తండాలో సింగిల్‌విండో పరిధిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ధాన్యం పోసేందుకు స్థలం లేకపోవడంతో ఎక్కడ ఖాళీగా ఉంటే అక్కడే ధాన్యం పోశారు. తేమశాతం వచ్చిన కూడా హమాలీలు లేక కొనుగోలు ప్రక్రియ ప్రారంభంకాలేదు. ఈ క్రమంలో తండావాసులకు ఉపాధి లేకపోవడం, హమాలీలు రాకపోవడంతో రైతులు తాము పండించిన ధాన్యాన్ని వారే తూకం వేస్తున్నారు. కుటుంబంలో భార్యాభర్తలు ఇద్దరు కలిసి కాంటా చేయడానికి రాగా, ఒకరి తర్వాత ఒకరు ధాన్యాన్ని తూకం వేసి లారీల్లో తరలిస్తున్నారు.

– కోనరావుపేట, ఏప్రిల్ 22

వేడుకలకు రండి

- పెద్దమ్మ-పెద్దిరాజుల కల్యాణం, ఎల్లమ్మ సిద్ధోగం రావాలని రామన్నకు ఆహ్వానం
- సానుకూలంగా స్పందించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

సిరిసిల్ల రూరల్: మాజీ మంత్రి కేటీఆర్‌ను సన్మానించి పెద్దమ్మ–పెద్దిరాజుల కల్యాణ మహోత్సవానికి రావాలని ఆహ్వానిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్22 (నమస్తే తెలంగాణ)/ సిరిసిల్ల రూరల్/ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం మోహినికుంటలో ఎల్లమ్మ సిద్ధోగం, తంగళ్లపల్లి మండలం సారంపల్లిలో పెద్దమ్మ–పెద్దిరాజుల కల్యాణమహోత్సవానికి రావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను బీఆర్ఎస్ నాయకులు, ముదిరాజ్ సంఘ సభ్యులు ఆహ్వానించారు. సోమవారం సిరిసిల్లలో పట్టణ కార్యకర్తల సమావేశానికి వచ్చిన ఆయనను తెలంగాణ భవన్‌లో ఆర్‌బీఎస్ ముస్తాబాద్ మండల మాజీ కన్వీనర్ కల్వకుంట్ల గోపాల్‌రావు, పోతుగల్ పీఏసీఎస్ వైస్ చైర్మన్ మేరుగు రాజేశంగౌడ్, గౌడ సంఘం నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రఘుపతిగౌడ్, చంద్రలోక్, యాదగిరిగౌడ్, మోతె కిషన్‌గౌడ్, బాల్‌రాజు, గుగ్గిళ్ల ఆంజనేయులు, రాజేశ్వర్‌రావు, మహేశ్, ముదిరాజ్ సంఘ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. గ్రామంలో పెద్దఎత్తున జరిగే ఎల్లమ్మ సిద్ధోగం, పెద్దమ్మ–పెద్దిరాజుల కల్యాణమహోత్సవానికి రావాలని ఆహ్వానించగా, రామన్న సానకూలంగా స్పందించారు.

ముస్తాబాద్: ఎల్లమ్మ సిద్ధోగానికి రావాలని కేటీఆర్‌కు ఆహ్వానిస్తున్న బీఆర్ఎస్ నేతలు

పెద్దలింగాపూర్‌లో మట్టి నమూనాలను సేకరిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

భూసార పరీక్షలపై రైతులకు అవగాహన

ఇల్లంతకుంట, ఏప్రిల్ 22: ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా బాబూ జగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాల నాలుగో సంవత్సరం విద్యార్థులు సోమవారం పెద్దలింగాపూర్‌లో భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించారు. భూసార పరీక్షలకు మట్టి సేకరణ ఏవిధంగా చేపట్టాలో రైతులకు వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులకు చిరుధాన్యాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.

అకాల వర్షం.. తడిసిన ధాన్యం



అకాల వర్షంతో మండల కేంద్రంలో తడిసిన ధాన్యం

చందుర్తి, ఏప్రిల్ 22: అకాల వర్షం అన్నదాతకు కునుకులేకుండా చేస్తున్నది. మండల వ్యాప్తంగా సోమవారం అర్ధరాత్రి వర్షం కురిసింది. ఈ క్రమంలో మండల కేంద్రంతోపాటు తిమ్మాపూర్, మర్రిగడ్డ, నర్సింగాపూర్ గ్రామాలకు చెందిన పలువురు రైతుల ధాన్యం తడిసిపోయింది. కొనుగోలు కేంద్రాలు ఆలస్యం ప్రారంభం.. అకాల వర్షాలు పడడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం వెంటనే కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

డీజే నిర్వాహకుల బైండోవర్

చందుర్తి ఏప్రిల్ 22: డీజే నిర్వాహకులను సోమవారం తహసీల్దార్ ఎదుట బెండోవర్ చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని గ్రామాల్లో ముందస్తుగా డీజే నిర్వాహకులను బైండోవర్ చేసినట్లు తెలిపారు. దర్శనాల సంతోష్, పోలాస ప్రమోద్, కైర శశి, పులి ప్రశాంత్, అజయ్, నేవూరి సందీప్, ఎండీ ఇబ్రహీమ్‌ను బైండ్‌డోవర్ చేశామన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ, గ్రామాల్లో అనుమతులు లేకుండా డీజేలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకొని జరిమానా విధిస్తామని హెచ్చరించారు. పార్లమెంట్ ఎన్నికలు ముగిసేంతవరకు గ్రామాల్లో సౌండ్స్ నిర్వహించవద్దని సూచించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ముస్తాబాద్ ఏప్రిల్ 22: నామాపూర్‌లో ఏడు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్ఐ వెంకటరమణ తెలిపారు. సమాచారం మేరకు వారాశి దుర్గయ్య ఇంట్లో సోదాలు చేసి ఏడు క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళ అదృశ్యం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 22: బండలింగంపల్లికి చెందిన బండారి సుజాత(27) ఈ నెల 21 నుంచి కనిపించడం లేదు. కుటుంబ సభ్యులు ఉదయం ఐదు గంటలకు నిద్ర లేచి చూసేసరికి కనిపించకపోవడంతో ఇరుగు పొరుగు వారిని ఆరా తీయగా, సమాచారం దొరకలేదు. ఈ మేరకు సుజాత తండ్రి బాబు ఠాణాలో ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.

డబుల్ సైలెన్సర్లు ఉంటే కేసు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 22: ద్విచక్రవాహనాలకు డబుల్ సైలెన్సర్లు, వాహనాలకు పోలీస్ సైరన్లు ఉంటే వెంటనే తీసివేయాలని, లేకుంటే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ రాజుగౌడ్ హెచ్చరించారు. సోమవారం పలు గ్రామాల్లో వాహనాల తనిఖీ చేపట్టారు. సైరన్ ఉన్న వాహనాలను పట్టుకుని, కేసు నమోదు చేశారు. ప్రతి గ్రామంలో వాహనాల తనిఖీ చేస్తున్నామని, ఇందుకు వాహనదారులు సహకరించాలని కోరారు.

మే డే పోస్టర్ ఆవిష్కరణ

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 22: తంగళ్లపల్లి మండలం రాళ్లపేటలో సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో మే డే పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. మే డే దినోత్సవాన్ని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్య దర్శి గుంటి వేణు పిలుపునిచ్చారు. ఇక్కడ మండల కార్యదర్శి సోమ నాగరాజు, అంజయ్య, శంకర్, లక్ష్మీరాజం, సోమ మల్లయ్య, గణాది అంజయ్య, నారాయణ, రాజు, కనకయ్య, ఎల్లయ్య, మహేశ్, దేవయ్య ఉన్నారు.

పుస్తెమట్టెల వితరణ

ముస్తాబాద్ ఏప్రిల్ 22: కొండాపూర్‌లో నాగెల్లి భవాని, నామాపూర్‌లో యారపు స్వాతి వివాహం సోమవారం జరుగగా ఎంపీపీ జనగామ శరత్‌రావు దంపతులు వితరణ చేసిన పుస్తె మట్టెలను స్థానిక నాయకులు అందజేశారు. ఇక్కడ నిమ్మ దేవిరెడ్డి, మంద బాల్‌రెడ్డి, బాలగౌడ్, బండి ఆదర్శ పటేల్, సోహెల్ నాగెల్లి దేవయ్య, ముష్కం దేవయ్య, క్యారం మల్లేశ్, కృష్ణనారోజు చారి, సతీశ్, మహేశ్, తాడెపు అనిల్‌కుమార్, కొత్తపల్లి నారాయణ, ఎండీ వహీలుద్దీన్, బాలచంద్రం, ఎల్లం నరేంద్రాచారి ఉన్నారు.

నేడు వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

వేములవాడ రూరల్, ఏప్రిల్ 22: ఎదురుగట్ల గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ గంగరాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వామి వారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

అన్నదాతలు అప్రమత్తంగా ఉండాలి

- పౌరసరఫరాల కమిషనర్ డీ ఎస్ హాన్
- ధాన్యం కొనుగోళ్లపై వీసీ ద్వారా సమీక్ష

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ భీమ్యానాయక్, అధికారులు

కలెక్టరేట్, ఏప్రిల్ 22: అకాల వర్షాల నేపథ్యంలో అన్నదాతలు అప్రమత్తంగా ఉండాలని, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ హాన్ సూచించారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై సోమవారం పౌర సరఫరాల కమిషనర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుంచి అదనపు కలెక్టర్ ఎన్ భీమ్యానాయక్ హాజరయ్యారు. రాబోయే మూడు రోజుల్లో అకాల వర్షాలు ఉన్నందున అన్ని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైతులు ధాన్యాన్ని తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. ధాన్యం తడవకుండా అవసరమైన గోనెసంచులు, టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షించాలన్నారు. అలాగే కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. ఇప్పటి వరకు జిల్లాలో 5,379 రైతుల వద్ద నుంచి ₹82.13కోట్ల విలువైన 37,280 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. ఇందుకు గానూ ₹17.37కోట్లు రైతుల ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. ఈ రోజు వరకు మొత్తం 33,986 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు తరలించామని అదనపు కలెక్టర్ వివరించారు. ధాన్యం తరలింపులో క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పౌర సరఫరాల అధికారి జితేందర్‌రెడ్డి, పౌర సరఫరాల మేనేజర్ జితేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కత్తితో గొంతుకోసుకొని..

- మహిళ ఆత్మహత్యాయత్నం

వీర్నపల్లి, ఏప్రిల్22: కత్తితో గొంతుకోసుకొని ఓ మహిళ ఆత్మహత్యకు యత్నించిన ఘటన వీర్నపల్లి మండలం మద్దిమల్లలో సోమవారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన పోట్ల సుజాత(40)కు ఏడేండ్ల క్రితం కోనరావుపేటకు చెందిన లింబాద్రితో వివాహం కాగా, భర్త చనిపోయాడు. అప్పటి నుంచి తల్లిగారింట్లో ఇద్దరు పిల్లలతో కలిసి జీవనం సాగిస్తున్నది. మూడేళ్ల నుంచి కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నది. వైద్య చికిత్సకు డబ్బులు లేకపోవడంతో మనస్తాపం చెంది కత్తితో మెడ కోసుకొని ఆత్మహత్యకు యత్నించింది. స్థానికులు గమనించి ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా, ప్రస్తుతం సుజాత ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిసింది.

ఎడ్ల బండ్ల ప్రదక్షిణలు

కోనరావుపేట, ఏప్రిల్ 22: వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి అనుబంధ దేవాలయమైన మామిడిపల్లి శ్రీ సీతారామస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఎడ్ల ప్రదక్షిణ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎడ్లబండ్లు, వాహనాలను ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. అనంతరం యజ్ఞాచార్యులు మరింగంటి రామగోపాలచార్యులు, అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

వరి, మక్క చేన్లు దగ్ధం

- బాధిత రైతుకు ₹లక్ష వరకు నష్టం

ముస్కానిపేట గ్రామంలో ప్రమాదవశాత్తూ దగ్ధమైన వరి పంట

ఇల్లంతకుంట, ఏప్రిల్ 22: ముస్కానిపేట గ్రామానికి చెందిన గూడెల్లి నరేశ్ 20 గుంటల్లో వరి, 30గుంటల్లో మక్కజొన్న సాగు చేశాడు. పంటలు చేతికందిన సమయంలో సోమవారం ప్రమాదవశాత్తూ వరి పంటపై ఉన్న విద్యుత్ తీగలు ఒకదానికి ఒకటి గాలికి తగిలాయి. ఈ క్రమంలో వరి పంటపై మిరుగులు పడడంతో వరి పంట తోపాటు పక్కనున్న మక్క చేను అగ్నికి ఆహూతైంది. లక్ష రూపాయల వరకు నష్టపోయానని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

కండ్లలో కారం కొట్టి.. దాడి చేసి

- ధర్మారంలో ఓ కుటుంబంపై మరో కుటుంబం మూకుమ్మడి దాడి
- ఇద్దరికి తీవ్రగాయాలు, దవాఖానలో చికిత్స
- పోలీసుల అదుపులో నిందితులు

కోనరావుపేట, ఏప్రిల్ 22: భూ తగాదాలతో ఓ కుటుంబంపై మరో కుటుంబం మూకుమ్మడిగా గొడ్డళ్లు, కర్రలతో దాడిచేసి హత్యాయత్నం చేసిన ఘటన కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. ఎస్ఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కూతాడి కనకయ్య ఇంటి ముందున్న స్థలం విషయంలో అదే గ్రామానికి చెందిన లోకిని లచ్చయ్య కుటుంబానికి మధ్య కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. పలుమార్లు పంచాయితీలు కూడా జరిగాయి. అయినా వివాదం సద్దుమణగలేదు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి కూతాడి కనకయ్య తన కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేస్తున్నాడు. ఈ క్రమంలో లచ్చయ్య తన కుటుంబ సభ్యులు లోకిని సతీష్, లోకిని ప్రశాంత్, దేవరాజు, లోకిని మానస, లోకిని సారిక, ఎల్లవ్వతో కలిసి కర్రలు, గొడ్డళ్లు పట్టుకుని కనకయ్య ఇంటికి వచ్చి కండ్లలో కారం కొట్టి మూకుమ్మడి దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో కనుకయ్య, కొడుకు బాబు తీవ్రంగా గాయపడి అక్కడి నుంచి తప్పించుకున్నారు. అలాగే కనుకయ్య భార్య లక్ష్మి, కోడలు శిరీష, మనుమడు దైవాన్స్‌లపై కూడా దాడి చేశారు. ఇంటి ముందు ఉన్న కారు, ట్రాక్టర్, స్కూటీని సైతం ధ్వంసం చేశారు. గాయపడ్డ వారు సిరిసిల్ల ఏరియా దవాఖానలో చికిత్స పొందుతున్నారు. సోమవారం ఉదయం కుతాడి బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి, దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా, దాడికి పాల్పడిన వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

₹3లక్షలు పట్టివేత

పట్టుకున్న నగదు వివరాలు తెలుసుకుంటున్న సీఐ వెంకటేశ్వర్లు

చందుర్తి, ఏప్రిల్22: వేములవాడ పట్టణానికి చెందిన రేగుల రజినీకాంత్ ఎలాంటి ఆధారాలు లేకుండా ₹3లక్షలు తరలిస్తుండగా చందుర్తిలో సోమవారం పట్టుకున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. సదరు నగదును ఎన్నికల అధి కారులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. ఇక్కడ సీఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

రాజన్న వార్షికాదాయం ఆల్‌టైం రికార్డు

- ₹119.72కోట్లు రాక
- సింహభాగం హుండీదే.. ₹32.74 కోట్లు
- ఆ తర్వాత కోడె టికెట్లు.. ₹22కోట్లు,
- ప్రసాదాల ద్వారా ₹21.81కోట్లు

వేములవాడ, ఏప్రిల్ 22: వేములవాడ రాజన్న ఆలయం వార్షికాదాయంలో ఆల్‌టైం రికార్డు సృష్టించింది. గతంలో ఎన్నడూలేనివిధంగా 2023–2024 ఆర్థిక సంవత్సరం ₹100 వందకోట్ల మార్క్‌ను దాటేసింది. ఆలయ ఖజానాకు ఏకంగా ₹119 కోట్ల 72లక్షల 80వేల 241 నికర ఆదాయం సమకూరింది. ఈ మేరకు ఈవో కృష్ణ ప్రసాద్ సోమవారం వివరాలు వెల్లడించారు. ఈ యేడు మేడారం సమ్మక్క–సారక్క జాతర రావడంతో ఆలయానికి భక్తుల తాకిడి తాకిడి పెరిగి ఎక్కువ మొత్తంలో ఆదాయం సమకూరినట్లు చెప్పారు. ఈ ఆదాయంలో సింహభాగం ₹32.74 కోట్లు హుండీ ద్వారా లభించగా, ప్రసాదాల విక్రయం ద్వారా ₹21.81 కోట్లు, కోడె టికెట్ల విక్రయం ద్వారా ₹22 కోట్లు, లీజులు, లైసెన్స్‌ల ద్వారా ₹15.50 కోట్లు, వడ్డీల ద్వారా ₹5.55 కోట్లు, ధర్మశాలల ద్వారా ₹4.36కోట్లు, కల్యాణం టికెట్ల ద్వారా ₹3.55 కోట్లు, అభిషేకం టికెట్ల విక్రయం ద్వారా ₹2.79 కోట్లు, శీఘ్రదర్శనం టికెట్ల ద్వారా ₹2.37 కోట్లు, కేశఖండనం టికెట్ల ద్వారా ₹2.13 కోట్ల ఆదాయం, ఇతరత్రా వాటి ద్వారా ₹6.92 కోట్ల ఆదాయం లభించింది. ఇక గత సమ్మక్క సారక్క జాతర (2021–22) టైంలో ఆలయానికి ₹87.78కోట్లు ఆదాయం రాగా, ఈ ఏడాది అదనంగా మరో ₹31.94కోట్ల ఆదాయం సమకూరింది.

టాస్క్ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 22: తంగళ్లపల్లిలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాల, ఫైన్ ఆర్ట్స్ కళాశాలను టాస్క్ సంస్థ రిజనల్ మేనేజర్ దీపా బారాజు సోమవారం సందర్శించారు. టాస్క్ ద్వారా అందిస్తున్న కోర్సులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జూన్ నుంచి కొత్త కోర్సులను ప్రారంభిస్తామని, కోర్సులు పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందిస్తామన్నారు. ఇక్కడ ప్రిన్సిపాల్ రజినీ, వైస్ ప్రిన్సిపాల్ సుధాసింధు ఉన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

వార్షికోత్సవంలో భాగంగా నృత్యం చేస్తున్న చిన్నారులు

వేములవాడ రూరల్, ఏప్రిల్ 22: ఫాజుల్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు ఇన్‌చార్జి హెచ్ఎం లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి హెచ్ఎం వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. ఇక్కడ ఉపాధ్యాయులు రామస్వామి, కనకలక్ష్మి, విద్యార్థులు, వారి తల్లితండ్రులు ఉన్నారు.

కొమ్ము విరిగి షార్ట్‌సర్క్యూట్

- గడ్డివాము దగ్ధం, లేగదూడ మృతి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 22: బొప్పాపూర్‌లో షార్ట్‌సర్క్యూట్ కారణంగా గడ్డివాము దగ్ధం కాగా, లేగదూడ మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. బొప్పాపూర్‌కు చెందిన ఇల్లెందుల రాజిరెడ్డికి చెందిన పశువుల కొట్టం వద్ద మామిడి చెట్టు కొమ్మ విరిగి విద్యుత్ తీగలపై పడింది. ఈ క్రమంలో మెరుగులు చిమ్మి గడ్డివాము మీదపడ్డాయి. దీంతో పెద్దఎత్తున మంటలు చెలరేగగా ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. మంటలు చల్లార్చినప్పటికీ 160 కట్టల గడ్డి దగ్ధం కావడంతోపాటు లేగదూడ మృతి చెందింది. ప్రభుత్వం బాధిత కుటుంబానికి నష్ట పరిహారం అందించాలని గ్రామస్తులు కోరారు.

స్వామివారి దర్శనం కోసం క్యూలో, ఆలయ ప్రాంగణంలో వేచిఉన్న భక్తులు

పోటెత్తిన భక్తజనం

వేములవాడ టౌన్, ఏప్రిల్ 22: వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయం సోమవారం రద్దీగా కనిపించింది. వేకువజాము నుంచే భక్తులు క్యూలో బారులు తీరి స్వామివారిని దర్శించుకున్నారు. కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకుని, బెల్లాన్ని పంచిపెట్టారు. భక్తిశ్రద్ధలతో రాజన్నకు కోడె మొక్కులు చెల్లించుకున్నారు. దాదాపు పది వేలకు పైగా భక్తులు దర్శించుకోగా, సుమారు 13 లక్షల ఆదాయం సమకూరినట్లు అధికారులు వెల్లడించారు.

ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ రూరల్, ఏప్రిల్ 22: ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆకాంక్షించారు. వేములవాడ మండలం ఆరెపల్లిలోని హనుమాన్ ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమానికి విప్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు బాగుండాలని స్వామివారిని వేడుకున్నట్లు విప్ పేర్కొన్నారు. ఇక్కడ మాజీ సర్పంచులు ఇటిక్యాల నవీనరాజు, మల్లేశం, నరేశ్, లింగయ్య, శ్రీనివాస్ ఉన్నారు.

కృష్ణవేణిలో గ్రాడ్యుయేషన్ డే

రుద్రంగి, ఏప్రిల్ 22: మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ప్రీ ప్రైమరీ విద్యార్థులు యూకేజీ క్లాసులు పూర్తి చేసుకుని ప్రాథమిక తరగతులలో అడుగుపెడుతున్న సందర్భంగా వారికి సర్టిఫికెట్స్ అందజేసి ప్రోత్సహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎలిగేటి నరేష్, డైరెక్టర్లు తీపిరెడ్డి వెంకటరెడ్డి, ఎర్రం గంగనర్సయ్య, పడాల సురేశ్, ప్రిన్సిపాల్ హరినాథ్ రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పొత్తూరులో ఎడ్లబండ్ల ప్రదక్షణలో పాల్గొన్న జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, నాయకులు

ఘనంగా వేంకటేశ్వర స్వామి జాతర

ఇల్లంతకుంట, ఏప్రిల్ 22: పొత్తూరులోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ జాతర ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఎడ్ల బండ్ల ప్రదక్షిణ ఆకట్టుకున్నది. జాతర ఉత్సవాల్లో జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, ఎంపీటీసీ పట్నం అశ్విని, మాజీ సర్పంచ్ సిద్ధం శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

మే డే సక్సెస్ చేయాలి

వేములవాడ, ఏప్రిల్ 22: మే డే కార్మిక దినోత్సవం విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగ్గంటి ఎల్లారెడ్డి కోరారు. సోమవారం వేములవాడ పట్టణంలోని డివిజన్ సీఐటీయూ కార్యాలయంలో ఆయన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. మే డేను ఘనంగా నిర్వహించుకుందామని, కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గుర్రం అశోక్, ఎర్రవెల్లి నాగరాజు, గణేశ్, కుర్ర రాజశేఖర్, ముక్తికాంత, అశోక్, తదితరులు ఉన్నారు.